క్లుప్తంగా

కోరింగ అభయారణ్యంలో ఎఫ్ఆర్ఓ ట్రైనీలు



కోరింగ అభయారణ్యంలో బోటు షికారు చేస్తున్న ట్రైనీ ఎఫ్ఆర్ఓలు

తాళ్లరేవు: కోరింగ అభయారణ్యాన్ని ఆదివారం మహారాష్ట్ర చంద్రపూర్ ఫారెస్ట్ అకాడమీకి చెందిన ఎఫ్ఆర్ఓ ట్రైనీలు సందర్శించారు. 52 మంది అభయారణ్యంలోని ప్రదేశాలను ఆసక్తిగా తిలకించారు. మడ చెట్ల అందాలను తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేసారు. అనంతరం ఉత్సాహంగా బోటు షికారు చేసారు. అభయారణ్యంలోని చిత్తడి నేలలు, వన్యప్రాణుల వివరాలు, మడ అడవుల విశిష్టత, పక్షుల తదితర వివరాలను ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ వారికి వివరించారు. సీబీఈటీ, ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు కె.సిద్ధార్ధ, వీరభద్రరావు, ఎఫ్‌బీఓ జి.గోపి నాగేంద్రకుమార్, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, కె.ధనుంజయరావు, సీబీఈటీ, ఆలివ్ రిడ్లే టర్టిల్స్ కన్జర్వేషన్ తదితర అంశాలపై అధ్యయనం చేసారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎఫ్‌బీఓలు కె.మహేష్, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, సీబీఈటీ సిబ్బంది ఉన్నారు.

నేత్ర వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు



తాళ్లరేవు మాధవరాయునిపేటలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు మాధవరాయునిపేటలో దివంగత పిల్లి ధనరాజు, సత్యవతి, వెంకట్రావు, పిల్లి ధరణి సత్య జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆస్పత్రి వైద్యులు అనూష వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. శస్త్ర చికిత్సలు అవసరమైన 50 మందికి సోమవారం శ్రీ కిరణ్ కంటి ఆస్పత్రికి తరలించి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆస్పత్రి కోఆర్డినేటర్ శివగణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, నాయకులు వుంగరాల వెంకటేశ్వరరావు, మేడిశెట్టి సత్తిబాబు, ధూళిపూడి వెంకటరమణ, గంజా సూరిబాబు, రోళ్ల చక్రవర్తి పిల్లివారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



సీతారామపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

తాళ్లరేవు: కాకినాడ న్యూరోస్టార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కోరంగి పంచాయతీ సీతారామపురంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో సుమారు 300 మంది రోగులను పరీక్షించారు. ఆదివారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరంలో న్యూరోస్టార్ ఆస్పత్రి వైద్యుడు అశోక్‌కుమార్ నేతృత్వంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు విజయ్‌కుమార్, శివకుమార్, పవన్‌కుమార్, దంత వైద్యులు రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేసారు. ముఖ్యంగా ఆస్పత్రిలో నిర్వహించే టెస్ట్‌లకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు అశోక్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్ రహీమ్, వైద్యుడు విజయ్‌కుమార్, పీఆర్వోలు రమణ, తాజుద్దీన్, వీరేంద్ర, సిబ్బంది సాయిరాఘవ, సంధ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన



ఎంపీ గంటి హరీష్‌ను సత్కరిస్తున్న సంస్కార భారతి కోనసీమ జిల్లా అధ్యక్షులు తదితరులు

అమలాపురం రూరల్: స్థానిక కోనసీమ భానోజీ రామర్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్ కళా సాహిత్యాల అఖిల భారతీయ సంస్థ, సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో డాక్టర్ రామన్ ఫౌండేషన్, సాయిబాబా నాట్య మండలి విజయవాడ వారితో ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎంపీ హరీష్ మాథూర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. నిర్వాహకులను ఆయన అభినందించారు. ఎంపీ హరీష్‌ను సంస్కార భారతి కోనసీమ జిల్లా అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి, కార్యదర్శి వలవల వెంకటరెడ్డి నాయుడు సత్కరించారు.

మురుగు నీరు తాగేదెలా?

- అధికారుల పర్యవేక్షణ లోపం
- పంట కాలువల్లోకి డ్రెయిన్, మూత్రశాలల వ్యర్థ జలాలు
- ఆ కాలువలే తాగునీటి ప్రాజెక్టులకు ఆధారం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు



సామంతకుర్రు కెనాల్‌లో ప్రవహిస్తున్న కలుషిత జలాలు

ఉప్పలగుప్తం: పూర్వం పొలాల్లో పనిచేసుకునే రైతులు తమ దాహాన్ని తీర్చుకునేందుకు పంట కాలువ ద్వారా పొలానికి ప్రవహిస్తున్న నీటిని దోసిలితో తీసుకుని తాగేవారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ప్రభుత్వాలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తాగునీటి ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేస్తున్నాన్నా ప్రజలు అందించే తాగునీరు కలుషితంగా మారుతోంది. దీనికి ప్రధాన కారణం తాగునీటి ప్రాజెక్ట్‌లకు నీటిని సరఫరా చేసే పంట కాలువల్లో ఎగువ ప్రాంతాల్లోని ఇళ్లల్లో, పరిశ్రమల్లో, దుకాణాల్లో, హోటళ్లల్లో, అపార్టుమెంట్లలో వాడే దిగుడు నీరు (డ్రెయినేజీ) గొట్టాలను పెట్టి మురుగు కాలువల్లోకి పంపించాల్సిన వ్యర్థ జలాలను నేరుగా పంట కాలువల్లోకి వందలి వేయడమే. దీనితో ప్రజలు తాగే తాగునీరు, రైతులు పంటలకు అందించే సాగునీరు పూర్తి కలుషితంగా మారుతోంది. దీనితో ప్రజలు టైఫాయిడ్, మలేరియా, కామెర్లు తదితర రోగాలబారిన పడుతున్నారు. క్యాన్సర్, కిడ్నీ, లివర్ సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్నారు. ఈ విషయాలను ఆయా గ్రామాల్లో ప్రజలు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. దీనికి కారణం రాజకీయ నాయకుల ఒత్తిడి ఎక్కువయిందని ప్రజల ఆరోపిస్తున్నారు. కలుషిత నీటిని ప్రజలు తాగి ఆరోగ్యాన్ని పాడు చేసుకోకుండా ప్రతి పంట కాలువల్లో అనుసంధానంగా ఉన్న డ్రెయినేజీ గొట్టాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

అమలాపురం నియోజకవర్గంలోని మున్సిపాలిటీకి అందించే నడిపూడి రిజర్వాయర్, పేరూరు, ఇందుపల్లి, చిందాడగరువు, గుండెపూడి, బోడసకుర్రు, చల్లపల్లి, కూనవరం, భీమనపల్లిలోని సమగ్ర రక్షిత నీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్) తాగునీటి జలాలను అందించే మంచి నీటి చెరువులు ఉన్నాయి. సామంత్రకుర్రు, కొమ్మరగిరిపట్నం, చల్లపల్లి, ఎస్.యానం పీడబ్ల్యూఎస్ మంచి నీటి చెరువులు ఆ గ్రామాల్లో ఉన్న ప్రజలకు తాగునీటిని అందిస్తున్నాయి. ఈ మంచి నీటి చెరువులన్నింటికీ బెండ కెనాల్, అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంట కాలువల నుంచి నీరు సరఫరా అవుతుంది. దాదాపుగా 2.5 లక్షల మంది ప్రజలు ప్రతి రోజు ఈ నీటినే తాగుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ కెనాల్ ఎగువ ప్రాంతాల నుంచి డ్రెయిన్ గొట్టాలు దర్శనమిస్తూనే ఉన్నా అధికారుల చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. అమలాపురం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు పలు ప్రధాన శాఖలు స్థానికంగా ఏర్పడ్డాయి. ప్రధాన పంట కాలువలు, పంట కాలువల్లో నిత్యం డ్రెయిన్ గొట్టాల నుంచి మురుగు నీరు దిగి పంట కాలువల్లో ప్రవేశిస్తోంది. ఇంత జరుగుతున్నా జల వనరుల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.



సమనసలో ప్రధాన పంట కాలువలోకి ప్రవేశిస్తున్న డ్రెయిన్ నీరు



అమలాపురం ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ప్రధాన పంట కాలువలోకి ప్రవేశిస్తున్న డ్రెయిన్ నీరు

పంట పొలాలకు కలుషిత జలాలు

అమలాపురం నల్లవంతెన నుంచి ఎర్రవంతెన మధ్య ఉన్న ప్రాంతంలో అపార్ట్‌మెంట్ల నుంచి ప్రభుత్వ కార్యాలయాల నుంచి నిత్యం డ్రెయిన్ నీరు చల్లపల్లి ప్రధాన పంట కాలువలో కలుస్తోంది. ఎర్రవంతెన నుంచి సమనస మధ్య ప్రాంతంలో అధికంగా రొయ్యల కంపెనీలు, హోటళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ఈ పంట కాలువలోనే చేరుతోంది. ఈ ప్రాంతంలోనే ఇరిగేషన్ అధికారి కార్యాలయం ఉన్నా చర్యలు శూన్యం. ఉప్పలగుప్తం మండలంలోని విలసవిల్లి, భీమనపల్లి, చల్లపల్లి, గోపవరం, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, అల్లవరం మండలంలోని గోపాయిలంక అక్విడెక్టు నుంచి సామంతకుర్రు వరకూ, బోడసకుర్రు, గోడి, గోడిలంక గ్రామాల్లో డ్రెన్ గొట్టాలు అధికంగా అనధికారకంగా స్థానికులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ గొట్టాల నుంచి వాడకం నీటితో పాటు మూత్రశాలల్లోని నీరు పంట కాలువల్లోకి చేరుతోంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది శుద్ధిచేసి అందించినా ఇటువంటి కలుషిత నీరు తాగటంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని పలువురు అంటున్నారు. తాగునీటి ప్రాజెక్టులతో పాటు సాగునీటికి కలుషిత జలాలతో ఇబ్బందులు తప్పవని, కనీసం కొన్ని ప్రాంతాల్లో పశువులు సైతం ఈ నీటిని ముట్టడం లేదని రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టి కాలువల్లోకి ఏర్పాటు చేసిన డ్రెయిన్ గొట్టాలను తొలగించపోతే అమలాపురం నియోజకవర్గ ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది



తాగునీటి ప్రాజెక్ట్‌లకు జలాలను అందించే పంట కాలవల్లోకి డ్రెయినేజీ గొట్టాలను అనుసంధానం చేసి ఆ కలుషిత నీటిని వదలడంతో ప్రజారోగ్యం పూర్తిగా దెబ్బతింటోంది. చాలా గ్రామాల్లో వ్యర్థ జలాలు పంట కాలువల్లోకి ప్రవహిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కొన్ని చోట్ల సెప్టిక్ ట్యాంకు జలాలను పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఆక్వా చెరువుల నుంచి వ్యర్థ జలాలలను రాత్రి వేళల్లో కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఈ దుర్గంధభరితమైన నీటిని అధికారులు ప్రజలకు తాగునీరుగా అందిస్తున్నారు. దీనితో ప్రజల ఆరోగ్యం క్షీణిస్తోంది.

– అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, గోపవరం, ఉప్పలగుప్తం మండలం

‘తల్లికి వందనం’ అందక తండ్రికి పాట్లు

శ్రీనివాస్ ఆధార్ నంబరుపై 20 విద్యుత్ కనెక్షన్లు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ బల్లగేటు సెంటర్ ప్రాంతానికి చెందిన మంగా శ్రీనివాస్ ఆధార్ నంబర్‌తో 20 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో రెండు కనెక్షన్లు శ్రీనివాస్‌వి కాగా 18 కనెక్షన్లు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. ఆయన కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఆ విద్యార్థికి తల్లికి వందనం పడకపోవడంతో శ్రీనివాస్ సచివాలయానికి వెళ్లి ఆరా తీశాడు. ఈక్రమంలో శ్రీనివాస్ ఆధార్ నంబర్‌తో మొత్తం 20 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని సిబ్బంది తెలిపారు. దీంతో ఆయన ఆయా విద్యుత్ కనెక్షన్ల వారి ఇంటికెళ్లి ఆధార్ మార్చుకోవాలని శ్రీనివాస్ ప్రాధేయ పడుతున్నాడు. వారిలో 16 మంది ఆచూకీ తెలిసిందని మరో ఇద్దరు అడ్రస్ తెలియపోవడంతో ఆయన దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖాధికారులకు తెలియజేసినట్టు శ్రీనివాస్ చెబుతున్నాడు. తన ఆధార్ కార్డు పేరుతో ఉన్న ఇతరుల విద్యుత్ కనెక్షన్లను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నాడు. సాధారణంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలంటే ఇంటి డాక్యుమెంట్లతోపాటు పన్ను రశీదు, ఆధార్‌కార్డు తప్పని సరి. ఇవేమీ సరిపోల్చకుండా ఆధార్ నంబర్‌తో 20 విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇచ్చారని బాధితుడు ప్రశ్నిస్తున్నాడు. తన ఆధార్ నంబర్లో ఉన్న విద్యుత్ కనెక్షన్లు తొలగించకపోతే తన కుమారుడు చదువుకు ఆటంకం ఏర్పడుతుందని ఆయన వాపోతున్నాడు.

యానాం నూతన మున్సిపల్ కమిషనర్ రాక



మున్సిపల్ కమిషనర్ అఖిల్‌ను సత్కరించిన ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ

యానాం: మున్సిపల్ నూతన కమిషనర్‌గా ట్రైనీ ఐఏఎస్ అధికారి బుద్ధి అఖిల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకోవడంతో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, చెల్లి గోపీనాథ్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం యానాం ప్రభుత్వ అతిథిగృహానికి ఆయన చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన బుద్ధి అఖిల్ 2023లో సివిల్ సర్వీసెస్‌లో ఐదో ప్రయత్నంలో 321వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన ప్రాథమిక, హైస్కూల్ విద్య అంతా స్వగ్రామంలో జరిగింది. అనంతరం సిద్దిపేట కాకతీయ యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసారు. 2021లో సివిల్స్‌లో 566 ర్యాంకు రావడంతో ఢిల్లీ పోలీస్ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఆయన పని చేశారు. అనంతరం ఆయన పట్టుదలతో కృషి చేసి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే ప్రథమ కర్తవ్యమని తెలిపారు. ఆయన యూట్యూబ్ చానల్ ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అనేక సూచనలు, సలహాలు అందిస్తుంటారు. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 200 మంది వరకు గ్రూప్-1, ఎస్సై, కానిస్టేబుల్ తదితర ఉద్యోగాలు ఆయన ఫాలోవర్స్ సాధించారు. యానాం మున్సిపాలిటీకి తొలి ఐఏఎస్ అధికారిగా అఖిల్‌ను పుదుచ్చేరి ప్రభుత్వం కమిషనర్‌గా నియమించింది.

విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలి

అమలాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం నాల్గవ తరగతి విశ్రాంత ఉద్యోగులకు పరిస్థితి దయనీయంగా మారిందని, ప్రభుత్వాలు వారిని ఆదుకోవాలని విశ్రాంత ఉద్యోగ సంఘం నాయుడు కందేరి వీర్రాజు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరితగతిన పెన్షన్ పెంచాలని ఉద్యోగుల సమస్యలపై ప్రధాన మంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్నాయుడు, కేంద్ర ప్రభుత్వ ఉన్నత అధికారులకు వినతి పత్రాలు పంపినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్‌కు నెలకు రూ.4,000 పెన్షన్ ఇస్తోందని దానిలో సగం కూడా కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు రావడంలేదని ఆయన అవేదన వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై అమలాపురం ఎంపీ హరీష్ మధూర్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు.

‘యువత పోరు బాట’ విజయవంతం చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ శ్రీకాంత్



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 23వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు యువత పోరు బాట పేరుతో అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కోర్డినేటర్ పినిపే శ్రీకాంత్ పిలుపునిచ్చారు. అమలాపురం మండలం భట్నవెల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ స్వగృహం వద్ద ఆదివారం వైఎస్సార్ సీపీ యువత పోరుబాటపై సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా విద్యార్థుల చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. దీని వల్ల పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, వారి తల్లిదండ్రులు అప్పులు చేసి పిల్లల ఫీజులు కడుతున్నారని అన్నారు. ప్రైవేట్ కళాశాల యాజమానులు ఫీజు బకాయిలు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్తున్నారని తెలిపారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి మూడు నెలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం లక్షలాది మంది విదార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని విమర్శించారు. ఫీజు బకాయిలు ఇచ్చే వరకు వైఎస్సార్ సీపీ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన అన్నారు. జిల్లా పరిధిలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత పోరు బాటకు తరలి రావాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు.

పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి

అమలాపురం రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల సుపరిపాలనలో పేదల సంక్షేమం కోసం కృషి చేశారని బీజేపీ అమలాపురం పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ అన్నారు. వికసిత భారతదేశపు అమృతకాలం భారత వికసిత సంకల్ప సభ 4వ వార్డులో అమలాపురం పట్టణ భాజపా అధ్యక్షుడు అరిగెల తేజ వెంకటేష్ అధ్యక్షతన జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్ నివాసంలో ఆదివారం నిర్వహించారు. పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రమిల్లి పాండురంగ రావు, బీజేపీ యువ మోర్చా ఉపాధ్యక్షురాలు జగతా శాంతి, కొండేటి జయలక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకటసుబ్బరాజు, బీజేపీ యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి వంశీ, అల్లవరం మండలం అధ్యక్షుడు కట్ట నారాయణమూర్తి భారత సంకల్ప సభలో పాల్గొని భారత వికసిత ప్రతిజ్ఞ చేశారు.

ప్రశాంతంగా అసిస్టెంట్ ఉద్యోగ రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 256 అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఆదివారం నిర్వహించిన రెండవ దశ రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా యానాంలో రెండు పరీక్షా కేంద్రాలైన రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం హైస్కూల్, మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్లో పరీక్ష నిర్వహించారు. రెండు సెంటర్లలో మొత్తం 436 మంది పరీక్షకు హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారని ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. పుదుచ్చేరిలో నాలుగు రీజియన్లలో మొత్తం 10,766 మందికి 10,416 మంది పరీక్షకు హాజరు కాగా 350 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను పుదుచ్చేరి ప్రభుత్వ ఆరోగ్యశాఖ అండర్ సెక్రటరీ మురుగేషన్, డీపీటీ పుదుచ్చేరి డిప్యూటీ డైరెక్టర్ కుమారవేలు, సూపరింటెండెంట్ సీగర్, ఆర్ఏఓ మునిస్వామి ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు.

నలుగురు జూదరుల అరెస్టు

అమలాపురం టౌన్: వడ్డిగూడెం శివారులోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద గల షెడ్డులో పేకాట ఆడుతున్న వారిపై పట్టణ పోలీసులు ఆదివారం సాయంత్రం ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఈ ఆకస్మిక దాడి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తహసీల్దార్ దివాకర్‌కు సత్కారం

ఉప్పలగుప్తం: ఉత్తమ సేవలు అందించినందుకు స్థానిక తహసీల్దార్ వీఎస్ దివాకర్‌కు రెవెన్యూ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దివాకర్‌ను వీఆర్వోలు కార్యాలయ సిబ్బంది ఆదివారం ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ దివాకర్‌కు దుశ్శాలువాలు కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న వీఆర్వో జి.మమత, వీఆర్ఏ ఫణికుమార్‌ను దుశ్శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. రీసర్వే డీటీ సుబ్రహ్మణ్యం, వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు అహ్మద్ అలీషా, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలి

తాళ్లరేవు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా వేడుకలకు వెళ్లే క్రమంలో పాముకాటుకు గురై మృతి చెందిన వడ్డి సంజన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, పులపకూర గోపాలకృష్ణ ఆదివారం డిమాండ్ చేసారు. తాళ్లరేవు మండలం పటవల గ్రామ శివారు శాంతిమూల గ్రామానికి చెందిన విద్యార్థిని సంజన కుటుంబాన్ని వారు ఆదివారం పరామర్శించి ఓదార్చారు. యోగా వేడుకల పేరుతో రూ.300 కోట్లు ప్రజాధనాన్ని ప్రభుత్వం వృథా చేసిందని విమర్శించారు. పాలకులకు గిన్నీస్ రికార్డులపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై లేదని వారన్నారు.

ఎన్డీయే కూటమి పాలన అవినీతిమయం

యానాం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని కూటమి పుదుచ్చేరిలో అధికారంలో రావడం ఖాయమని మాజీ సీఎం నారాయణ సామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతపరమైన రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పుదుచ్చేరి ప్రజలు మళ్లీ ప్రస్తుతం ఉన్న ఎన్డీయే కూటమిని అంగీకరించే స్థితిలో లేరని స్పష్టం చేశారు. దానికి కారణం బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి మేనిఫెస్టో హామీలను అమలు చేయలేదని, ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయంగా పాలన నడుస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, అవినీతికి పాల్పడిన అధికారులు, పాలకులు జైలుకు వెళ్లడం తథ్యమని నారాయణసామి అన్నారు. ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ కోసం ఎంపీ వైధిలింగం ఆధ్వర్యంలో కమిటీని నియమించినట్టు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తమిళనాడు కరికులమ్ అమలు చేస్తామన్నారు.

పుదుచ్చేరి వ్యవసాయ మంత్రికి తప్పిన ప్రమాదం

యానాం: పుదుచ్చేరి వ్యవసాయ శాఖ మంత్రి తేనె జయకుమార్ త్రుటిలో రోడ్డు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఆదివారం ఆయన ప్రయాణిస్తున్న కారు పుదుక్కొటై జిల్లాలో మంగోడు సమీపంలో ప్రమాదానికి గురైంది. అయితే మంత్రి జయకుమార్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడగా ఆయన వ్యక్తిగత సహాయకుడు తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. తంజావూరులో మంత్రి జయకుమార్ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సైక్లిస్టును తప్పించబోయి ఆగి ఉన్న రోడ్డు రోలర్‌ను కారు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న ప్రకాష్, దయానిధి, డ్రైవర్ సిలంబరసన్, సుకుమార్ గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుపై వివాదం

సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న పోలీసులు



హడ్కో కాలనీలో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం

అంబాజీపేట: భారత ఉపప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రాం విగ్రహ ఏర్పాటుపై వివాదం తలెత్తింది. సమస్య పరిష్కారానికి పోలీసులు కృషి చేస్తున్నారు. ఇందుకు సంబంధించి మాచవరం పంచాయతీలోని పశువుల సంత సమీపాన ఉన్న హడ్కో కాలనీలో శనివారం రాత్రి స్థానిక దండోరా యువకులు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. హడ్కో కాలనీలో దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితమే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఇందిరాగాంధీ విగ్రహాలను మాల సామాజిక వర్గీయులు ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాల చెంతనే దండోరా యువకులు కూడా జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని నెలకొల్పారు. కాగా గత కొన్నేళ్లుగా జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు విషయంలో రెండు సామాజిక వర్గీయుల మధ్య వివాదం తలెత్తుతూనే ఉంది. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని వేరేచోట పెట్టుకోవాలని మాల సామాజిక వర్గీయులు, అంబేడ్కర్, ఇందిరా గాంధీ విగ్రహాల చెంతనే జగ్జీవన్ రామ్ విగ్రహం ఉండాలంటూ దండోరా సామాజిక వర్గీయులు పట్టుబడుతూ, శనివారం రాత్రి జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని హడావుడిగా నెలకొల్పారు. ఈ వివాదం కాస్త పోలీస్‌స్టేషన్ వరకూ చేరింది. విగ్రహం ఏర్పాటు చేసిన స్థలాన్ని పోలీసులు పరిశీలించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. హడ్కో కాలనీలో ఏర్పాటు చేసిన జగ్జీవన్ రామ్ విగ్రహ వివాదంపై ఇరు సామాజిక వర్గాలతో చర్చిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొంటామని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి ఎస్సైలు బి.శివకృష్ణ, ఎ.చైతన్యకుమార్, హరికోటిశాస్త్రి, పోలీస్ సిబ్బందితో బందోబస్తు చేస్తున్నారు.

ఈదురుగాలులకు కూలిన ధ్వజస్తంభం



ఈదురుగాలులలకు కూలిన ధ్వజస్తంభం

మామిడికుదురు: భారీ ఈదురుగాలుల ప్రభావానికి మామిడికుదురులోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ధ్వజస్తంభం కూలిపోయింది. ఆలయానికి భక్తులు వస్తుంటారు. కానీ శనివారం రాత్రి తొమ్మిది గంటలు దాటిన తర్వాత ఈ సంఘటన జరిగింది. ఆ సమయంలో ఆలయంలో అర్చకులతో సహా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆలయం వెలుపల భారీ అభయాంజనేయస్వామి విగ్రహం ఉంది. ఆ విగ్రహం పక్కనే ధ్వజస్తంభం పడింది. దీంతో అక్కడ ఏ విధమైన నష్టం జరగకపోవడం విశేషం. సుమారు 11 ఏళ్ల క్రితం ఈ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారని ఆలయ అర్చకుడు చంద్రమౌళి భాస్కరం ఆదివారం తెలిపారు.